క్లుప్తంగా

నిత్యవసర సరుకులు అందజేత



నిత్యవసర సరుకులు అందిస్తున్న యువజన సంఘం సభ్యులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో రెండు దత్తత కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన శివ రామాంజనేయ యువజన సంఘం సభ్యులు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు సోమవారం అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన పెదపూడి ఇందుమతి, వడ్డి రాజు కుటుంబాలకు ప్రతినెలా ఇలా నిత్యవసర సరుకులు ఇచ్చి, తమవంతు సాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, బి.కృష్ణమూర్తి, జి.గోవిందరావు, జె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకుంటే మేలు అని ప్రకృతి వ్యవసాయం ఎల్-2 అధికారి గౌరీశ్వరరావు తెలిపారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో రైతులకు విత్తనశుద్ధిపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానాల్లో భాగమైన బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసుకుని, పొలాల్లో జల్లడం ద్వారా పంటకు చీడపీడలు పట్టవని, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



కాలువల్లో పూడికలు తీస్తున్న కూలీలు

సంతకవిటి: మండలంలోని జావాం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు సోమవారం చేపట్టారు. సర్పంచ్ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించారు. అలాగే చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయవద్దని గ్రామస్తులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సర్పంచ్ తెలిపారు.

గర్భిణులకు నారాయణసేవ



గర్భిణులకు ఆహారం అందిస్తున్న సత్యసాయి భక్తులు

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి సోమవారం వచ్చిన గర్భిణులకు సత్యసాయి భక్తులు నారాయణసేవ చేశారు. ఈ సేవలో భాగంగా ఆస్పత్రికి విచ్చేసిన 100 మంది గర్భిణులకు మధ్యాహ్న భోజనం కింద పౌష్టికాహారం అందజేశారు. ప్రతినెలా ఈ కార్యక్రమం చేపట్టి, గర్భిణుల కడుపు నింపుతుండడం చాలా సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ, డాక్టర్ ఆశీర్వనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు



విజేత జట్టుకు మెమెంటో అందజేస్తున్న ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామంలో ఆ గ్రామ యువకుడు తాడి రాజేంద్రకుమార్ జ్ఞాపకార్థం స్థానిక యువత ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పది జట్లు పాల్గొనగా బొండపల్లి మండలానికి చెందిన కెరటాం గ్రామ జట్టు వాలీబాల్ పోటీలు నిలిచిం ది. ద్వితీయ స్థానంలో వైజాగ్ జట్టు, తృతీయస్థానంలో మక్కువ జట్టు నిలిచాయి. అతిథిగా హాజరైన ఎస్.భూర్జవలస ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్ చేతుల మీదుగా విజేత జట్టుకు రూ.20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు, తృతీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.8 వేల నగదు, మెమెంటోలు అందజేశారు.

జోరుగా 'ఉపాధి' పనులు



తెర్లాం: ఉపాధి పనులు పరిశీలిస్తున్న సాంకేతిక సహాయకులు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. ఎంపీడీవో మధుసూదనరావు, ఏపీవో సుశీల ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సాంకేతిక సహాయకులు సోమవారం పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే వచ్చే రోజువారీ వేతనం గిట్టుబాటు అవుతుందని తెలిపారు. క్షేత్ర సహాయకులంతా వేతనదారుల మస్టర్లను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ పనులు కల్పించాలని, ఒకరి పేరుమీద మరొకరు పనిలోకి వస్తే అనుమతించవద్దన్నారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున వేతనదారులంతా ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకోవాలని, పని ప్రదేశంలో గతంలో ఇచ్చిన టెంట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



వంగర: కొండచాకరాపల్లిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న 29 గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఈ పనుల్లో ప్రతిరోజూ 5 వేల మంది వేతనదారులు పాల్గొంటున్నారని ఏపీవో హరినారాయణ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం



మొక్కలు నాటుతున్న రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

సంతకవిటి: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని రాజాం పర్యావరణ పరిరక్షణ కన్వీనర్ ఆర్.వి.జి.నాయుడు తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అమృత హాస్పిటల్ ఎండీ గార రవిప్రసాద్ మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.జనార్ధనరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.షణ్ముఖరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, తిరుమలరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురంలో కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. పీఎం అవార్డుల కోసం గ్రామాలను ఎంపిక చేసేందుకు కేంద్రం నుంచి వచ్చిన ఈ బృందం ప్రతీ గ్రామం వెళ్లి, అక్కడి మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం వంటివి ఎలా ఉన్నాయో పరిశీలిస్తున్నారు. హోలిస్టిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ అంశంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని వసతులు, అభివృద్ధి, సంక్షేమం తదితర అంశాలపై నివేదిక తయారు చేసి, ఉన్నతమైన గ్రామాలకు అవార్డులు బహూకరించనున్నట్లు సమాచారం. వారి వెంట సీపీవో బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, విజయనగరం ఆర్‌డీవో సూర్యకళ, ఈఈ కవిత, డీఈ పీఎంకే రెడ్డి, ఏఈ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ త్రినాథరావునాయుడు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్‌తో ఎస్ఈబీ సిబ్బంది

రాజాం సిటీ:

స్థానిక బొబ్బిలి జంక్షన్ వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ సోమవారం తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లామని, ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టరును గుర్తించి, సీజ్ చేశామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బొబ్బిలి సంస్థానం పాఠశాల పూర్వ విద్యార్థులు

బొబ్బిలి: మండలంలోని రంగరాయపురంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి బొబ్బిలి పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా హాజరయ్యారు. ఒకరి నొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు.
అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి



రామభద్రపురంలో చూడితో ఉన్న పాడిఆవును పరీక్షిస్తున్న పశువైద్యాధికారులు హిరణ్య, సురేష్

రామభద్రపురం: పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని రామభద్రపురం, ఆరికతోట పశువైద్యాధికారులు హిరణ్య, సురేష్ సూచించారు. మండల కేంద్రంలోని పలు పశువుల ఆరోగ్యాన్ని వారు సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో పశువులు ఎక్కువగా సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, పాడిరైతులు అప్రమత్తమై వ్యాధుల నుంచి మూగజీవాలను రక్షించాలన్నారు. వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. పశువైద్యానికి మందులు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పశువులకు ఏవైనా పెద్దపెద్ద వ్యాధులు వస్తే వాటి నిర్ధారణకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే దూరప్రాంతాల పాడిరైతుల పశువులను ఆస్పత్రికి నడిపించి తరలించకుండా సంచార పశువైద్యశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఆయా సేవల ద్వారా సత్వరమే పశువులకు వైద్యసేవలు అందుతుండడంతో గతంలో కన్నా ఇప్పుడు పశు మరణాలు తగ్గాయని వారు తెలిపారు. ఆర్‌బీకేలలో లభించే గడ్డి విత్తనాలు వేసి, ఆ గడ్డిని పశువులకు వేస్తే అధిక పాలు ఇస్తాయన్నారు.

కూరగాయల సాగు బాగు



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రం వద్ద పండించిన కూరగాయలను లబ్ధిదారులకు అందజేస్తున్న కార్యకర్త శ్రీదేవి

ఐసీడీఎస్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కార్యకర్తలు చేపట్టిన కూరగాయల సాగు సత్ఫలితాలనిస్తోంది. కూరగాయలు, ఆకుకూరలు పండించేందుకు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి ఎంపిక చేసి, సాగును ప్రోత్సహించారు. సాగుకు అవసరమైన నిధులు కూడా మంజూరు చేశారు. ఈ మేరకు తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి పర్యవేక్షణలో తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కార్యకర్త వై.శ్రీదేవి పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు మంచి దిగుబడిని ఇస్తున్నాయి. వీటినే కేంద్రాలకు వస్తున్న పిల్లలకు వండిపెడుతున్నారు. మిగతా వాటిని కేంద్రం పరిధిలోని మిగతా లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలకు పంచిపెడుతున్నారు.

– తెర్లాం

నేడు ధారగంగమ్మ మారు పండగ

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణ ప్రజల కొంగు బంగారమైన ధారగంగమ్మ అమ్మవారి మారు పండగను మంగళవారం జరిపించేందుకు దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి స్థానిక ధారగంగమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ అర్చకులు రాజగోపాలాచార్యులు సోమవారం చెప్పారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర,రవికెలు, పూలు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారని తెలిపారు.

అన్నసమారాధన

గ్రామదేవత ధారగంగమ్మ పండగ అనంతరం మారు పండగ రోజు భక్తులకు అన్నసమారాధన చేయడం రివాజు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో టీవీ, సినీరంగ నటులతో రాత్రి 7 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెర్లాం–5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి అన్నారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం సోమవారం కేంద్రంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె.. లబ్ధిదారులకు పాలు, గుడ్లు తదితర పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రతినెలా ప్రభుత్వం అందిస్తున్న ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న ఈ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటున్నారన్నారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

రాజాం సిటీ: పాలథిన్ విక్రయిస్తున్న పలు దుకాణాల్లో స్థానిక మున్సిపల్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాలిథిన్ సంచులను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసరోడ్డు, బజారు, మాధవబజారు తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన వారు.. పాలిథిన్ కవర్ల అమ్మకాలపై నిషేధం ఉన్నా విక్రయాలు చేపట్టడం సరికాదని దుకాణదారులను హెచ్చరించారు. మరోసారి ఇదే తీరు పునరావృతమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ దుకాణంలో గుడ్డసంచులే విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు సురేష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టి పరీక్షలతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామ పొలాల్లో మట్టి నమూనాల సేకరణ సోమవారం చేపట్టారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేసుకుంటే ఏ నేల ఏ పంటకు అనుకూలమో తెలుస్తుందన్నారు. ప్రతీ రైతు తమ పొలంలో పంట వేసే ముందు ఆ పొలంలోని మట్టిని ల్యాబ్‌కు తరలించి, పరీక్షలు చేయించాలని సూచించారు. నేలసారం ఆధారంగా పంట వేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తెగుళ్లు, చీడపీడల నుంచి పంట తట్టుకోగలదన్నారు. కార్యక్రమంలో శరత్‌బాబు, బి.సూర్యనారాయణ, సాయిమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు



బైపాస్ వద్ద భారీ లారీ

రామభద్రపురం: మండల కేంద్రంలోని అతి తక్కువ వెడల్పు అయిన రోడ్డు మీదుగా భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతర్ రాష్ట్ర రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సోమవారం మండల కేంద్రంలోనికి భారీ లారీ రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అలాగే ఉదయం విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. రాజాం రూటు నుంచి రామభద్రపురం వాహనం వస్తుండగా ఆ వాహనానికి తగలకుండా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ వైర్లను వాహన చోదకులు కర్రలతో పైకి ఎత్తి పట్టుకున్నారు. దీంతో కాసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాజాం నుంచి సాలూరు వైపు వెళ్తా గాంధీబొమ్మ సెంటర్‌లో వాహనాన్ని టర్నింగ్ చేస్తుండగా ఈ ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. అయితే 100 చక్రాలు కలిగిన ఈ లారీని చూసేందుకు జనం ఎగబడ్డారు.

'ఉపాధి' పనులు కల్పించండి



పనులు కల్పించాలని కోరుతున్న గ్రామస్తులు

బొబ్బిలి: తమకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని మండలంలోని దిబ్బగుడివలస గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా ఎంపీటీసీ నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి, అధికారులను కలిసి, పనులు చేసుకునే అవకాశం ఇవ్వాలన్నారు. దాదాపు మూడు నెలల పాటు కొనసాగే ఈ పనులు ఎన్నో కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని, తమకు కూడా అవకాశం కల్పించాలని అభ్యర్థించారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

బొబ్బిలి రూరల్:

నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఎం.ఆనందరావు తెలిపారు. మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో నవధాన్యాల సాగు-వాటి ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట సాగుకు ముందు పొలాల్లో నవధాన్యాలు వేసుకుని, మొక్కలైన తర్వాత వాటి అదే నేలలో కలియదున్నాలని తెలిపారు. దీంతో భూసారం పెరిగి, పంటకు అవసరమైన పోషకాలు నేల నుంచి అందుతాయన్నారు. అలాగే చీడపీడలు, తెగుళ్ల బారిన పంట పడకుండా రక్షణ లభిస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందరరావు నవధ్యాన్యాలు కలిపే విధానం, వాటిని పొలాల్లో సాగుచేసే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ స్వర్ణ, శంకరరావు, సన్యాసినాయుడు, రమేష్ పాల్గొన్నారు.



నవధాన్యాలను కలిపే విధానాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

బాడంగి: నవధాన్యాల సాగుతో నేల సారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని ఏవో కె.శిరీష తెలిపారు. మండలంలోని వీరసాగరం గ్రామ రైతు భరోసా కేంద్రంలో నవధాన్యాలు కలపడంపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం 18 రకాల విత్తనాలతో నవధాన్యాల కిట్లు తయారు చేసి, రైతులకు పంపిణీ చేశారు. వీటిని పొలంలో చల్లిన 45 రోజుల తర్వాత మొలకెత్తిన మొక్కలను అదే నేలలో కలియదున్నాలన్నారు. దీంతో భూసారం పెరిగి, పంటలు బాగా పండుతాయన్నారు. అలాగే పంటకు పట్టే తెగుళ్లు, చీడపీడలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ సతీష్‌కుమార్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: రైతులకు నవధాన్యాల కిట్లు అందిస్తున్న ఏవో శిరీష

రాజాం: రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే నవధాన్యాల వినియోగం తప్పనిసరి అని ప్రకృతి వ్యవసాయం డీపీఎంయూ ఆనందరావు తెలిపారు. మండలంలోని పొగిరి, పెనుబాక, బొద్దాం, గార్రాజుచీపురుపల్లి, బొమ్మినాయుడువలస గ్రామాల్లో నవధాన్యాలు తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం తయారు చేసిన నవధాన్యాలను పలువురు రైతులకు అందజేశారు. 50 శాతం రాయితీపై అందిస్తున్న ఈ నవధాన్యాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ రేఖ, వీఏఏ జాన్సీ, యూనిట్ ఇన్‌చార్జ్ రమాదేవి, ఐసీఆర్‌పీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



రాజాం: గార్రాజుచీపురుపల్లిలో నవధాన్యాల విత్తనాల తయారీని వివరిస్తున్న అధికారులు

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ఏవో రేణుకాసాయి

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో పలువురు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఏవో ఎ.రేణుకాసాయి పచ్చిరొట్ట ఎరువు ప్రయోజనాలను వివరించారు. ప్రధాన పంట సాగుకు ముందు వీటిని పొలంలో చల్లుకుని, మొక్కలైన తర్వాత నేలలో దుక్కి చేసి వదిలేయాలని తద్వారా భూసారం పెరుగుతుందన్నారు. అలాగే పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లు అంతగా సోకవన్నారు. ఎకరాకు నాలుగు కిలోల చొప్పున పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలని, తద్వారా పంటలు బాగా పండుతాయని, అధిక దిగుబడులు వస్తాయన్నారు.